క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన

బంటుమిల్లి: స్థానిక అభయాంజనేయస్వామి మందిరం వద్ద సోమవారం అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు. శ్రీ రామనవమి వార్షిక కల్యాణం సందర్భంగా ఆలయ ట్రస్టీ సన్నాల మస్తాన్‌రావు దంపతుల పర్యవేక్షణలో నిర్వహించిన సమారాధనలో పలు గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీరామ మందిరం నిర్మాణానికి శంకుస్థాపన

పెడన: మండల పరిధిలోని బల్లిపర్రు పంచాయతీ సింగరాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీరామమందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ ఆర్జా వెంకట నగేష్, టీడీపీ నాయకులు శెలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, సర్పంచు జోగి నాగవరలక్ష్మీ, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో జింజేరు గ్రామానికి చెందిన పటమట మాణిక్యలరావుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.37,292 అందజేశారు.

45 మందికి హోమియో వైద్య సేవలు

చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో వైద్యులు మణికంఠ 45 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దింటకుర్తి జ్యోతి, అన్నం సత్యవాణి, సువర్చల తదితరులు పాల్గొని సేవలందించారు.

ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రాలు దానం

నాగాయలంక: గ్రామంలోని ఒకటో వార్డులో నివశిస్తున్న వేములపల్లి విజయలక్ష్మి(70) అనారోగ్యంతో సోమవారం మరణించడంతో ఆమె నేత్రాలు ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో ఆమె కుమారుడు హేమ ప్రసాద్, కుమార్తె కుసుమ కుమారి స్వచ్ఛందంగా ముందు కొచ్చి విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసారు. స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ సహకారంతో కంటి ఆసుపత్రి ఐ టెక్నీషియన్ సాయి బృందం వచ్చి మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు. స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకు వచ్చిన ఆ కుటుంబ సభ్యులను పలువురు గ్రామ ప్రముఖులు అభినందించారు.

ఆస్తి పన్ను 30వ తేదీలోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ

పెడన:పురపాలక సంఘ పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నును ఈ నెలా 30వ తేదీలోగా చెల్లించిన వారికి ఆ పన్నులో 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు చెల్లించడానికి మున్సిపల్ కార్యాలయంలో పన్నులు కట్టించుకునే కౌంటరు తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. పుర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

బంటుమిల్లి: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.... మండల పరిధిలోని సాతులూరు గ్రామానికి చెందిన ఎల్లంకోట సత్యనారాయణ (35) ఈ నెల ఆరో తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మద్యం తాగి ఇంటికి రావడంతో భార్యతో గొడవ జరిగింది. భార్యను బెదిరించేందుకు ఇంట్లో ఉన్న గడ్డి మందు సత్యనారాయణ తాగాడు. చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పెడన మున్సిపాలిటీలో చెత్త ఏరే పనులు చేస్తున్నాడు.

ఉన్నత విద్యపై అవగాహన

మోపిదేవి: ఉన్నత విద్యాభ్యాసం వల్ల విద్యార్థుల జీవితాల్లో ఎన్నో మార్పులు సంభవిస్తాయని బాపట్ల కళాశాల విద్యార్థులు తెలిపారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో బాగంగా జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం మోపిదేవి ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆర్గనైజర్ డాక్టర్ ఎం సంధ్యా, పోగ్రాం రిప్రెజెంటెటివ్ డాక్టర అపర్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు వ్యాసరచన, వకృత్వ, పరుగు పందాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు.

చలివేంద్రం ఏర్పాటు

అవనిగడ్డ: పంచాయితీ కార్యాలయం వద్ద సోమవారం చలివేంద్రాన్ని సర్పంచ్ గొరుముచ్చు ఉమా ప్రారంభించారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాటచారులకు చల్లని తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అరుణ, ఈవో అనితతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులెక్కువ.. యూనిట్లు తక్కువ..

- తమ్ముళ్లు చెప్పిన వారికే రుణాలిచ్చేలా సంకేతాలు
- గ్యారంటీతో పాటు ఫిపార్సు లేఖలకు ఆపసోపాలు పడుతున్న దరఖాస్తుదారులు



లబ్ధిదారులను ఇంటర్వ్యూ చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

పెడన: కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా కార్పొరేషన్‌లు ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పించేందుకు కసరత్తు చేపట్టింది. నోటిఫికేషన్ ఇవ్వడమే తరువాయి అన్నట్లుగా ఆయా కార్పొరేషన్లు ద్వారా రుణాలు పొందడానికి అర్హులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. దరఖాస్తులు చూస్తుంటే కొండంత ఉన్నాయి. కానీ దరఖాస్తుదారులకు అందించే రుణాలు మాత్రం అంతంత మాత్రంగా ఉండటంతో పాటు తమ్ముళ్లు సిఫార్సు చేసిన వారికే ఇచ్చేందుకు అధికారులు సిద్ధమతుండటం గమనార్హం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆయా రుణాలు మంజూరు చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీపీ చైర్మన్‌గాను, ఎంపీడీవో కార్యదర్శిగా ఉంటూ బ్యాంకర్లు సభ్యులుగా ఉండి దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలు నిర్వహించే వారు. ప్రస్తుతం కూటమి ఈ విధానానికి స్వస్తి పలికింది. కారణం క్షేత్రస్థాయిలో పాలకవర్గాలు వైఎస్సార్ సీపీకి చెందిన వారే అధికంగా ఉండటంతో ఇంటర్వ్యూలు నిర్వహణలో పాలకవర్గాలకు అవకాశం ఇవ్వకుండా కేవలం అధికారులు, బ్యాంకర్ల ప్రతినిధులు మాత్రమే ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 50 శాతం సబ్సిడితో రూ.3లక్షలు వరకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవ్వడంతో ఎలాగైనా ఈ రుణాలు పొందాలనే ఆలోచనలతో తమ్ముళ్ల పావులు కదుపుతున్నారు.

సిఫార్సు లేఖల కోసం అగచాట్లు....

ఏ విధంగా అయినా సబ్సిడీ లోన్ పొందాలనే ఆలోచనలతో తమ్ముళ్ల కూడా అధికంగానే దరఖాస్తులు చేసుకున్నట్లుగా సమాచారం. పెద్ద స్థాయిలోని వారితో సిఫార్సు లేక తెచ్చుకుంటే తమకు తప్పకుండా సబ్సిడీ లోన్ వస్తుందనే ఆశతో ఆశావహులు కూటమిలోని పెద్ద వారిని ఆశ్రయిస్తున్నారు. కొందరు సీనియర్లు సైతం తమకు రుణం ఇప్పించాలని కోరుతున్నట్లుగా తెలుస్తోంది.

మండలంలో 600... పట్టణంలో 373 దరఖాస్తులు

పెడన మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి 600లకు పైగా దరఖాస్తులు వచ్చాయి. బీసీలకు 45, కాపులకు 17, ఈడబ్ల్యూఎస్ వారికి 7, కమ్మ ఒకటి, మేదర, కుమ్మరి వారికి ఒక్కొకకటి మరోక రెండు ఇతర కేటగిరిల వారికి కేటాయించారు. మొత్తం 73 యూనిట్లు కింద కొందరికి వ్యక్తిగతంగా రూ.3లక్షలు, మరికొందరికి గ్రూపు లోన్స్ కింద రూ.8లక్షలు చొప్పున ఇవ్వనున్నారు. పట్టణానికి వస్తే 23 వార్డులలో అర్హులైన వారు 373 మంది దరఖాస్తు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 55 యూనిట్లును మాత్రమే ఇవ్వనున్నారు. బీసీలకు సంబంధించి 304 దరఖాస్తులు రాగా 41 యూనిట్లును ఇవ్వనున్నారు. పోటీ బాగా ఉండటంతో చాలా మంది సిఫార్సు లేఖలపైఆధారపడ్డారు. కాపు కార్పొరేషన్ 49 దరఖాస్తులు రాగా కాపు, రెడ్డి వారికి కేటాయించిన యూనిట్లు ఏడు మాత్రమే. అలాగే కమ్మ కార్పొరేషన్‌కు ఐదు యూనిట్లు కేటాయించగా ఒక దరఖాస్తు మాత్రమే రావడం విశేషం. సబ్సిడీ లోన్స్ మంజూరు చేయడానికి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అదే విధంగా పురపాలక సంఘ కార్యాయలంలో 8వ తేదీన ఇంటర్వ్యూలు చేపడతారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

చల్లపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్, మాజీ శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు సోమవారం చల్లపల్లిలో పర్యటించారు. పడమరవీధికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ మోపిదేవి ఉమామహేశ్వరరావు(ఉమ)కు కొన్ని రోజుల క్రితం గుండె ఆపరేషన్ జరిగింది. ఈ నేపథ్యంలో ఉమ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చల్లపల్లి నారాయణరావునగర్‌లో ఉంటున్న వరిగంజి అర్జునరావు కుమారుడు నాగార్జునను కూడా పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం మనస్థాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న నాగార్జున క్రమక్రమంగా కోలుకుంటున్నారు. లక్ష్మీపురం శివారు రామానగరంకు చెందిన వాగ్దేవి చల్లపల్లి పబ్లిక్ స్కూల్ అధినేత తుమ్మల సీతారాంబాబు సతీమణి తుమ్మల ఉదయ లక్ష్మీ ఇటీవల విజయవాడలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. సింహాద్రి రమేష్‌బాబు రామానగరంలోని వారి ఇంటికి వెళ్ళి సీతారాంబాబు, ఆయన కుమారుడు వెంకట దినేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉదయ లక్ష్మీ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ శీలం వెంకట సత్యనారాయణ (నాని), పార్టీ నాయకులు లక్ష్మీపురం-2 ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, మత్తి రాంబాబు, పాగోలు నాగసీతారామరావు (ఫణి), ఎస్సీ సెల్ నాయకులు జుజ్జువరపు భాగ్యారావు, పిన్నిగంటి రవి, చింతలమడ బాబీ, దుట్టా రమణ, ముచ్చు శ్రీను, ముచ్చు భాను, నాయుడు చంద్రశేఖర్(పెద్దారెడ్డి), పేరుబోయిన ఫణి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

చిన్నారి సంరక్షణ, పోషణకు బాధ్యత వహించాలి

కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం):దత్తత తీసుకున్న చిన్నారి ఆదిత్య పోషణ, సంరక్షణకు బాధ్యత వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో హైదరాబాద్‌కు చెందిన పి. అజయ్‌కుమార్, శ్వేత నిగమ్‌లు మచిలీపట్నం నగరంలోని శిశు గృహలో ఆశ్రయం పొందుతున్న సంవత్సరం వయసు కలిగిన ఆదిత్య అనే బాలుడ్ని దత్తత తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ బాలాజీ దంపతులు ఇద్దర్ని అభినందించి ఇకపై బాలుడి సంరక్షణ బాధ్యత పూర్తిగా వారిపై ఉందన్నారు. 2021 లో దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న ఆ దంపతులకు కేంద్ర ప్రభుత్వ దత్తత అధీకృత సంస్థ (కారా) అనుమతి లభించటంతో చిన్నారిని కలెక్టర్ వారికి దత్తత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, నోడల్ అధికారి భానుమతి తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ముస్లింల నిరసన



చల్లపల్లిలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

చల్లపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని ఈ సవరణ బిల్లును కేంద్రం వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరుతూ సోమవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున చల్లపల్లిలో నిరసన ర్యాలీ చేపట్టారు. చల్లపల్లి-మచిలీపట్నం ప్రధాన రహదారిలోని పెద్ద మసీదు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. చల్లపల్లిలోని మూడు మసీదులతోపాటు ఘంటసాల, లక్ష్మీపురం, లంకపల్లి గ్రామాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. హిందూ, ముస్లీం భాయ్ భాయ్ అని అందరి మద్య చిచ్చురేపే వక్ఫ్ సవరణ బిల్లుకు తాము వ్యతిరేకమంటూ పరిసరాలు దద్దరిల్లేలా నినాదాలు చేశారు. సుమారు 200 మందికి పైగా ముస్లింలు ర్యాలీలో పాల్గొన్నారు. పెద్ద మసీదు మత గురువు ఇమామ్, పెద్ద మసీదు కమిటీ ప్రెసిడెంట్ షేక్ నసీమ్ ఘోరి, చిన్న మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ షరీఫ్, మహ్మద్ మక్బూల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్లిం నాయకులు మీర్ రిజ్వాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షద్, కమాల్, సీపీఎం నాయకులు కరీముల్లా, ముస్లీం మైనార్టీ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు పఠాన్ కరీముల్లాఖాన్, మహ్మద్ ఆరీఫ్, అబ్దుల్ హమీద్, మహ్మద్ బేగ్, మహ్మద్ అన్వర్ బేగ్, మహ్మద్ ఇబ్రహీమ్, హేక్ సిలార్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మండల తహశీల్దార్ వనజాక్షికి వినతి పత్రం సమర్పించారు. వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించటాన్ని నిరసిస్తూ ముస్లింలకు చెందిన వ్యాపార దుకాణాలను మధ్యాహ్నం వరకూ మూసివేసి బంద్ ప్రకటించారు.

కన్నీటి నయనాలతో యతిరాజ కుమార్ అంత్యక్రియలు

అవనిగడ్డ: కృష్ణానదిలో మునిగి మరణించిన మత్తి యతిరాజకుమార్ అలియాస్ వర్ధన్ (16) అంత్యక్రియలు సోమవారం కన్నీటినయనాలతో సాగింది. మండల పరిధిలోని మోదుమూడికి చెందిన ముగ్గురు యువకులు కొత్తపేట వద్ద కృష్ణా నదిలో నీటమునిగి మరణించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో మరణించిన మత్తి వెంకట గోపికిరణ్ (14), మత్తి వీరబాబు మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించగా, బంధువులు దూర ప్రాంతంలో ఉండటం వల్ల మృతుని తండ్రి కోరిక మేరకు ఆదివారం యతిరాజకుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించగా బంధువులు, స్థానికుల కన్నీటి నయనాలతో మోదుమూడిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా శ్రీరాములవారి పట్టాభిషేక గ్రామోత్సవం

వి.రుద్రవరం(ఘంటసాల): శ్రీరామ నవమి సందర్భంగా రామాలయం వద్ద సీతారాముల పట్టాభిషేక మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. వందేళ్లుగా ఏటా స్వామి వారి పట్టాభిషేకం మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామ సర్పంచ్ యనిగళ్ల రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం బండి పాటను రూ.30,011లకు వేలం పాటలో పాడారు. గతంలో రూ. 2 వేల నుంచి రూ.8 వేల వరకు మాత్రమే భక్తులు పాట పాడేవారని, ఈ ఏడాది స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం బండి పాటను సర్పంచ్ రామకృష్ణ ప్రసాద్ రూ.30,011లకు పాడటం విశేషం. అనంతరం సర్పంచ్ రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఒంగోలు జాతి వృషభరాజములతో డప్పు వాయిద్యాలతో శ్రీరాముల వారి గ్రామోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

నేడు చల్లపల్లిలో చందనోత్సవం

చల్లపల్లి: షిరిడీ సాయిబాబా జ్ఞాన మందిరం నుంచి రామానగరంలోని హనుమత్ సాయి నిలయం వరకూ మంగళవారం చందనోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీసాయి భక్త బృందం సభ్యులు సాయి రామ్ ప్రసాద్ తెలిపారు. మచిలీపట్నంకు చెందిన జనాబ్ మహ్మద్ ఖాసీమ్, జనాబ్ షేక్ హఫీజ్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటల నుంచి ఈ చందనోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. సాయి పాదుకలతో పల్లకి ముందుకు సాగుతుండగా ఇరువైపులా చందనపు పళ్లాలతో మహిళలు, దేవగణ భక్త బృందాలు, తీన్‌మార్ మేళతాళాలలో సర్వదేవతా రూపాల నృత్యాలతో అంగరంగ వైభవంగా ఈ చందనోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మణి మాస్టారుకి కన్నీటి వీడ్కోలు

చల్లపల్లి: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మణి ప్రభాకరరావు మాస్టారు భౌతిక కాయానికి సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, మణి మాస్టారు దగ్గర చదువుకున్న విద్యార్థులు, గ్రామస్తులు, ఆయన అభిమానులు అందరూ పెద్ద ఎత్తున తరలి వచ్చి నివాళులర్పించారు. పుష్పగుచ్ఛాలు, పూలమాలలు మాస్టారు భౌతిక కాయంపై ఉంచి తమ అభిమానాన్ని, ఆప్యాయతను చాటుకున్నారు. రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, పలువురు ప్రముఖులు, ప్రజలు నివాళులర్పించారు. మణి ప్రభాకరరావు కోరిక మేరకు ఆయన నేత్రాలను ఎల్.వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి, శరీరాన్ని పిన్నమనేని మెడికల్ కళాశాలకు దానం చేశారు.

జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతం

పెడన:మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన సెషన్‌లో 57 మందికి 54 మంది హాజరవ్వగా ముగ్గురు అబ్సెంట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 62 మందికి 59 మంది హాజరవ్వగా ముగ్గురు అబ్సెంట్ అయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

ట్రాక్టర్ దూసుకొచ్చి ఏడుగురికి గాయాలు

కె. కొత్తపాలెం(మోపిదేవి): కృష్ణా కరకట్టపై వేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ రోడ్డుపక్కనున్న ఏడుగురు వ్యక్తులపై దూసుకుపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108లో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ ఇచ్చిన సమాచారం మేరకు.... శ్రీకాకుళం రేవు నుంచి ఇసుకతో ఉన్న ట్రాక్టర్ అవనిగడ్డ వైపు వెళుతూ మార్గమధ్యలో కె. కొత్తపాలెం కరకట్ట పక్కనున్న వారిపై దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో పడమట మాణిక్యాలరావు, నాగరాజు, ఫణీంద్ర, రామకృష్ణ, రాఘవేంద్రరావు, మల్లవోలు నాగ అశోక్, జంపాన నాగమల్లేశ్వరావులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలంకు చేరుకుని వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రక్కనున్న రెండు బైక్‌లను కూడా ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టడంతో వాహనాలకు డ్యామేజ్ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం మాణిక్యాలరావు, నాగరాజు, ఫణీంద్ర, రామకృష్ణ, రాఘవేంద్రరావులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆరోగ్యంతోనే ఆశాజనకమైన భవిష్యత్తు

సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

మచిలీపట్నంఅర్బన్: ఆరోగ్యకరమైన ప్రారంభంతోనే ఆశాజనకమైన భవిష్యత్తు సాధ్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య తెలిపారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి సమావేశ మందిరంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే, ప్రతి బిడ్డా ఆరోగ్యంగా ఎదుగుతుందని తెలిపారు. అది భవిష్యత్తు సమాజానికి పెట్టుబడిగా మారుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన తల్లి ఇంట్లో ఉంటే ఆ కుటుంబంతో పాటు దేశం ఆరోగ్యంగా తయారవుతుందన్నారు. స్త్రీలలో ఫెర్టిలిటీ రేటు తగ్గిపోతోందని, ఈ పరిస్థితిని వినియోగించుకుంటూ బిడ్డ గ్యారెంటీ అంటూ ఫెర్టిలిటీ సెంటర్లు పుట్టుకొస్తున్నాయన్నారు. రాజ్యాంగ పరంగా బిడ్డని జన్మనివ్వాలా, వద్దా అన్నది ఒక తల్లి వ్యక్తిగత హక్కు అని స్పష్టం చేశారు. ఆమె ఆరోగ్య, మానసిక స్థితి, ఆర్థిక పరిస్థితి ఇవన్నీ పరిగణలోకి తీసుకున్న నిర్ణయాన్ని సమాజం గౌరవించాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత మాట్లాడుతూ పోషకాహారం, సమయానికి టీకాలు, శుభ్రత, తల్లి, బిడ్డలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు. మెడికల్ కాలేజీ, నర్సింగ్ విద్యార్థులు ఆసుపత్రిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ నిరంజన్ రావు, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శివయ్య, ప్రిన్సిపాల్ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ రాజారమణి, అడ్వకేట్ ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా శ్రీరామ పట్టాభిషేకం



శ్రీరామ పట్టాభిషేక మహోత్సవంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, పీటలపై కూర్చున్న జంటలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీరామ మందిరంలో అచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, బండ్రెడ్డి, బావిరెడ్డి ముత్తాల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిసాయి. బ్రహ్మశ్రీ పెద్దిభట్ల భార్గవ శాస్త్రి, వరుల నాంచారయ్యశాస్త్రి బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ శ్రీరామ పట్టాభిషేక మహోత్సం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన సతీమణి విజయలక్ష్మీ కుటుంబ సభ్యులతో కలసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామి వారి పల్లకీసేవ, ఊరేగింపులో పాల్గొన్నారు. అలయ ధర్మకర్త, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్-స్వర్ణ, వెంకట్రామ్-కృష్ణవేణి, వెంకట కాశేశ్వరరావు -విజయలక్ష్మి పీటలపై కూర్చున్నారు. తదుపరి మహా పూర్ణాహుతి, గ్రామంలో స్వామివార్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్తులకు మహా అన్నప్రసాద వితరణ చేశారు. మండలి రాజా, సత్యప్రసాద్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు



టౌన్‌హాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: సబ్సిడీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం బుట్టాయిపేట టౌన్‌హాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సోమవారం 1 నుంచి 26వ డివిజన్ వరకూ మొత్తం 1,484 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్ తదితర బ్యాంక్‌ల ప్రతినిధులు హాజరయ్యారు. 8వ తేదీ మంగళవారం 27వ డివిజన్ నుంచి 50వ డివిజన్‌లలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కమిషనర్ బాపిరాజు పర్యవేక్షించారు.

మచిలీపట్నంరూరల్: బీసీ సబ్సిడీ రుణాల మంజూరు కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 900 మంది హాజరయ్యారని ఎంపీడీవో చీపురుపల్లి వెంకటేష్ తెలిపారు. 1190 మంది నుంచి అర్జీలు రాగా 900 మంది హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం శాఖ నుంచి కె.శివరామకృష్ణ, ఇండియన్ బ్యాంకు నుంచి సీఎం శాస్త్రి, కెనరా బ్యాంకు నుంచి నాగశివకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: బీసీ, కాపు కార్పొరేషన్‌ల ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో బి.రాజేశ్వరి ఆధ్వర్యంలో పోలవరం ఇండియన్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వరరావు తదితరులు డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిర్వహించారు. రామరాజుపాలెం, ఆర్.వి.పల్లి, మల్లవోలు, పోలవరం, పోసినవారిపాలెం, గండ్రం, ఐదుగుళ్లపల్లి, కలపటం, కంచాకోడూరు, కోకనారాయణపాలెం, లేళ్లగరువు, మద్దిపట్ల, ముక్కొల్లు, ఎస్‌కె.పాలెం, పి.జి.లంక, రామన్నపేట గ్రామాల చెందిన 500 మంది దరఖాస్తుదారులు హాజరైనట్లు ఎంపీడీవో వెల్లడించారు.

కృత్తివెన్ను: సబ్సిడీ రుణాలు పొందడం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి

ఘంటసాల: పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చెరుకూరి శ్రీనివాసరావు చల్లపల్లి యార్లగడ్డ పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి పై నియమించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి పై పంచాయతీ కార్యదర్శులైన వారికి నియామక పత్రాలను కలెక్టర్ బాలాజీ, జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ చేతుల మీదగా అందించారు. జూనియర్ అసిస్టెంట్ పని చేస్తున్న శ్రీనివాసరావు పదోన్నతి పై యార్లగడ్డ పంచాయతీ కార్యదర్శిగా నియమితులయ్యారు.

బీమా చెల్లించాలని కలెక్టర్ ఆదేశం

ఘంటసాల: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వెంటనే ప్రమాద బీమా అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం ఆదేశించారు. రెండేళ్ల క్రితం ఘంటసాల మండలం కొడాలి గ్రామానికి చెందిన కొడాలి గోపి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందగా బీమా చెల్లించలేదని మచిలీపట్నం కలెక్టరేట్‌లో జరిగిన మీ కోసం కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం కార్యకర్తలు జంపాన శ్రీనివాస గౌడ్, బయ్యవరపు దుర్గా ప్రసాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధి హామీ పనులకు శ్రీకారం

గూడూరు:మండల పరిధిలోని కప్పలదొడ్డి పంచాయతీలో ఉపాధి హామీ పనులకు సర్పంచ్ యక్కల మాధవి సోమవారం భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, మాజీ సర్పంచ్ కట్టా మునేశ్వరరావు, యక్కల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని సోమిశెట్టివారి వీధి అయోధ్య రామాలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకుని సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. శ్రీకాకుళం పరిసర ప్రాంతాల నుంచి 1500 మందికి పైగా భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) MACHILIPATNAM

Succession O.P.1/2025

Between :
1. Panchakarla Haranadh Prasad
2. Panchakarla Meher Kumari
... Petitioners

AND

NIL ... Respondents

GENERAL NOTICE

Take notice that the above petitioners filed a petition to grant a Succession Certificate in their favour for the mutual funds as mentioned in the schedule below belong to their deceased daughter Panchakarla Raga Latha.

If anybody having objections, they can raise on the date of hearing 30-04-2025 at 10:30 A.M. before the Honourable Court either in person or through an Advocate.

Petition Schedule property filed on behalf of the Petitioners :

S.No.	Folio No.	Units	Amount
1.	51022916681	6.59	2,919.85
2.	4237381/95	29.77	4,999.75
3.	51022916681	36.17	14,999.25
4.	51022916681	24.6	999.5

Machilipatnam
Dt : 07-04-2025

M. Zafrullah
Advocate for Petitioners
Cell : 94409 43689

మారణాయుధాలతో సంచరిస్తున్న ఐదుగురు అరెస్ట్

కోనేరుసెంటర్: మారణాయుధాలతో సంచరిస్తున్న ఐదుగురు అనుమానితులను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న వారిపై గతంలో నేరచరిత్ర ఉండటంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిజాంపేటకు చెందిన బాకీ చరణ్‌కుమార్, భాస్కరపురానికి చెందిన తన్నేరు నాగరాజు, వేముల దుర్గాప్రసాద్, కుంభ సాయిప్రసాద్, ఆలపాటి ప్రవీణ్‌లు ఓ నిర్మానుష్య ప్రాంతంలో కర్రలు, ఇనుపరాడ్లు ఆటోలో పెట్టుకుని తిరుగుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన చేరుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ కోర్టు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

తాగునీరు విడుదల

మచిలీపట్నం రూరల్: మంచినీటి చెరువులకు తాగునీరు విడుదల చేసినట్టు ఇరిగేషన్ డీఈ టి.వీరాంజనేయలు తెలిపారు. మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మంచినీటి చెరువులు, గ్రామ అవసరాలకు ఊర చెరువు నింపుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20 వరకు కాలువల ద్వారా నీరు వస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు గమనించాలని కోరారు. చేపల చెరువులు, రొయ్యల చెరువులకు తాగునీటిని తరలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.